


# జోరుగా వడ్డీ దందా!

## ఉమ్మడి జిల్లాలో అక్రమ వడ్డీ వ్యాపారం

- అధిక వడ్డీలతో సామాన్యుల నడ్డి విరుస్తున్న అక్రమార్కులు
- అమాయకులే లక్ష్యంగా దోచుకుంటున్న వ్యాపారులు
- 'రియల్ ఎస్టేట్' ముసుగులో ఫైనాన్స్ కార్యకలాపాలు
- తనఖాగా ఏటీఎం కార్డులు, పట్టాదారు పాసు పుస్తకాలు
- ఆర్థికంగా చితికి బలవన్మరణాలకు పాల్పడుతున్న అమాయకులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

నిజామాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కొన్నిరోజులుగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వడ్డీ వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోతున్నది. కోట్ల రూపాయల్లో వడ్డీ వ్యాపారం నిర్వహిస్తూ, సామాన్యుల నడ్డి విరుస్తున్నారు. సామాన్యుల బలహీనతలను ఆసరాగా చేసుకొని సొమ్ము చేసుకుంటున్నారు. అప్పులిచ్చి అక్రమంగా అధిక వడ్డీలు వసూలు చేస్తూ అమాయకులను నిండా ముంచుతున్నారు. చాలా మంది తమ అవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని వారు అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్నారు. కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా వడ్డీ వ్యాపారుల అవతారమెత్తారు. పేరుకు రియల్ ఎస్టేట్ కంపెనీ అని బయట బోర్డులు ఏర్పాటు చేసినా, లోపల మాత్రం ఫక్తు ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. గతంలో కేవలం పట్టణాలకు మాత్రమే పరిమితమైన ఫైనాన్స్ వ్యాపారులు, నేడు గ్రామాల వరకు విస్తరించారు. రోజువారి కూలీలు, చిరువ్యాపారులను ఎంచుకొని తమ వడ్డీ వ్యాపారాన్ని మూడు పువ్వులు..ఆరుకాయలుగా మార్చుకుంటున్నారు.రోజువారీగా, వారం రోజులకొకసారి ఇచ్చిన అప్పులను వసూలు చేస్తూ అమాయకుల నడ్డి విరుస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం గమనార్హం.

### రిజిస్ట్రేషన్ లేకుండా ఫైనాన్స్ వ్యాపారం

ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్ లేకుండానే ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. అక్రమంగా వ్యాపారం చేస్తూ అమాయకులను దోచుకుంటున్నారు. కొందరు పనులు లేక, చేసిన అప్పులు తీర్చడానికి, కొందరు కుటుంబ పోషణ కోసం, మరి కొందరు తమ వ్యాపార నిర్వహణకు సకాలంలో అప్పులు దొరక్క వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చి వారి నడ్డి విరుస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ వడ్డీ వ్యాపారుల చేతుల్లో నలిగిపోతున్నారు. గతంలో అనేక మైక్రో ఫైనాన్స్ కంపెనీలు ఏజెంట్ల ద్వారా గ్రామాల్లో విచ్చలవిడిగా రుణాలు ఇచ్చాయి. రుణాల వసూలుకు కంపెనీ ప్రతినిధులు.. ప్రజలను వేధింపులకు గురి చేయడంతో ప్రభుత్వం మైక్రో ఫైనాన్స్‌లపై ఉక్కుపాదం మోపింది. ప్రస్తుతం గుట్టు చప్పుడు కాకుండా చాప కింద నీరులా ఈ దందా కొనసాగుతుండడం గమనార్హం. పట్టణాలు, గ్రామాల్లో ఫైనాన్స్ వ్యాపారులు యథేచ్ఛగా వ్యాపారం నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఫైనాన్స్ దందాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

### వేధింపులు భరించలేక బలవన్మరణాలు

నిజామాబాద్ జిల్లాలో ఓ జాతీయ పార్టీకి చెందిన గల్లీ లీడర్ ఇదే విధంగా వేధింపులకు గురి చేయడంతో కుటుంబం సహా కృష్ణా నదిలో మునిగి తనువు చాలించారు. గతేడాది న్యాల్‌కల్ రోడ్డులో ఓ గుట్కా వ్యాపారి విషయంలోనూ ఇదే తరహా వేధింపులతో కుటుంబం బలైంది. పెళ్లీడుకు వచ్చిన బిడ్డపైనా ఫైనాన్స్ అక్రమార్కులు నోటికొచ్చినట్లుగా మాట్లాడడంతో తట్టుకోలేక ప్రాణాలు తీసుకున్నారు. కామారెడ్డిలో ఈ మధ్య కాలంలోనే ఫైనాన్స్ వ్యాపారుల వేధింపులు భరించలేక పలువురు ఆత్మహత్యలు చేసుకున్నారు. రియల్ ఎస్టేట్ దుకాణాల ముసుగు వేసుకుని కామారెడ్డి జిల్లా కేంద్రంలో కొద్ది మంది అక్రమంగా ఆర్థిక లావాదేవీలు నడుపుతున్నారు. పేరుకు రియల్ ఎస్టేట్ వ్యాపారం కనిపిస్తున్నప్పటికీ తెరచాటున ఫైనాన్స్ దందా నడుస్తున్నది. లోతుగా పోలీసులు దర్యాప్తు చేస్తే అక్రమార్కులు చాలా మంది బహిర్గతమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కామారెడ్డి నియోజకవర్గంలోని చుట్టుపక్కల ప్రాంతాల్లో బంగారం కుదువ పెట్టుకుని డబ్బులు ఇస్తున్న వారు కూడా ఉన్నారు. కిలోల కొద్ది బంగారాన్ని పోగేసుకుని జల్సాలు చేస్తున్న దుండగులు సైతం ఉన్నట్లుగా ప్రచారం జరుగుతున్నది.

### వ్యాపారుల 'పైసా' చికత్వం

వడ్డీ వ్యాపారుల వేధింపులు నిత్యం ఎక్కడో ఓచోట వెలుగు చూస్తూనే ఉంటున్నాయి. ఠాణా మెట్లు ఎక్కిన సందర్భాల్లోనే పోలీసులు పట్టించుకుంటున్నారు. లేదంటే ఉన్నతాధికారుల ఆదేశాలతో దాడులు చేసి మూడు,నాలుగు రోజు లు హల్ చల్ చేస్తున్నారు. నిరంతర నిఘా లోపించడంతో ఫైనాన్స్ వ్యాపారుల ఆగడాలు మితిమీరుతున్నాయి. పోలీసులు నిరంతరం నిఘా పెడితే పేదలకు మేలు జరిగే ఆస్కారం ఉంటుంది. అవసరానికి డబ్బులు ఇవ్వడం ఓ విధంగా సాయం చేయడమే అయినప్పటికీ వడ్డీపై వడ్డీలు వేసి చక్ర వడ్డీలు వసూళ్లు చేస్తూ 'పైసా'చికత్వాన్ని పొందుతున్న వ్యాపారుల చేతుల్లో ప్రజలు విలవిల్లాడుతున్నారు.

### రోజువారీ దందా!

వడ్డీ వ్యాపారులు అప్పు ఇచ్చే మొత్తం నగదులో కొంతమొత్తంగా ముందుగానే తీసుకుని మిగితావి రుణ గ్రహీతలకు ఇస్తున్నారు.రూ.10వేలు అప్పు తీసుకుంటే రూ.9వేలు మాత్రమే ఇస్తారు. దీనికి అప్పుతీసుకున్నవారు రోజుకు రూ.100 చొప్పున 100 రోజులు చెల్లించాల్సి ఉంటుంది. నిర్ణీత గడువులోగా అప్పు చెల్లించకపోతే పెనాల్టీ వసూలు చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నారు. వారం లేదా రోజు వారి పద్ధతిలో చెల్లించేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. తప్పని పరిస్థితుల్లో కొందరు వ్యాపారుల నుంచి అధిక వడ్డీకి అప్పులు తీసుకుంటూ అప్పుల ఊబిలో చిక్కుకుపోతున్నారు. వ్యాపారులు రూ. వందకు రూ.5 నుంచి రూ.10 వరకు వడ్డీ వసూలు చేస్తూ రూ.లక్షల్లో దోచుకుంటున్నారు. అధిక వడ్డీతో పాటు డాక్యుమెంటేషన్ చార్జీలు కూడా అప్పుతీసుకునే వారిపై రుద్దుతున్నారు.

## రూ.10 కోట్లతో వ్యాపారి పరారీ!

- తక్కువ ధరకు బంగారం విక్రయిస్తూ నమ్మించిన వర్తకుడు
- లబోదిబోమంటున్న బాధితులు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 29: పట్టణంలో హోల్‌సేల్‌గా బంగారం విక్రయించే ఓ వ్యాపారి.. పలువురి వద్ద రూ.10 కోట్లు వసూలు చేసి పరారైన ఘటన చోటుచేసుకున్నది. పట్టణానికి చెందిన ఓ వ్యాపారి నగల దుకాణాలకు బంగారాన్ని హోల్‌సేల్ ధరకు విక్రయించేవాడు. తులం బంగారాన్ని మార్కెట్ ధర కన్నా రూ.1500 నుంచి రూ. 2 వేల వరకు తక్కువ రేటుకు అమ్మేవాడు. ఇలా కొన్ని నెలలుగా బంగారం విక్రయిస్తున్న సదరు వ్యాపారి 15 రోజుల నుంచి కనబడకుండాపోయాడు. బంగారం కొనుగోలు చేయడానికి అతడికి కొందరు పెద్ద మొత్తంలో డబ్బులు ఇచ్చినట్లు తెలిసింది. ఇలా మొత్తం రూ.10 కోట్లకు పైగా ఇవ్వగా, వ్యాపారి కనిపించకపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు కోటగిరి రైతుల వినతి

## ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

పోతంగల్, ఏప్రిల్ 29 : ఎలాంటి ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కోటగిరికి చెందిన రైతులు.. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు విన్నవించారు. మంగళవారం మండలకేంద్రంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుకు హాజరైన కలెక్టర్‌ను కోటగిరి మండల కేంద్రానికి చెందిన రైతులు కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు.ధాన్యం కొనుగోలులో ఎకరానికి 80 బస్తాలు మాత్రమే తీసుకుంటున్నారని, ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తిగా కొనుగోలు చేయాలని విన్నవించారు. మండలంలోని చైతన్‌నగర్ గ్రామంలో గతంలో వ్యవసాయ భూములు లేని రైతులను గుర్తించి, ఒక్కొక్కరికి 17 గుంటల భూమిని అందజేశారని తెలిపారు. కానీ రైతుబంధు, రైతుబీమా, భూమిపై రుణాలు తదితర పథకాలకు నోచుకోలేకపోతున్నామని, పట్టాలు అందజేయాలని రైతులు కోరారు. సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి భరోసా ఇచ్చారు.



అవగాహన సదస్సులో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

## సిద్ధుల గుట్టపై భక్తులు అప్రమత్తంగా ఉండాలి

- అటవీశాఖాధికారులు చిరుతను బంధించాలి
- మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి




ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 29: పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సిద్ధుల గుట్టపై చిరుత సంచారం నేపథ్యంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి సూచించారు. సిద్ధుల గుట్టపై చిరుత సంచరిస్తున్నట్లు గమనించిన కొందరు ఆ దృశ్యాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో భక్తులు భయాందోళనలకు గురవుతున్నారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి స్పందించారు. కలెక్టర్‌తోపాటు జిల్లా అటవీశాఖాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని కోరినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి చిరుత పులి కదలికలు కనిపెట్టాలని సూచించారు. చిరుతను బంధించి అడవిలో వదిలేలా చర్యలు తీసుకొని, భక్తులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. చిరుతపులి సంచారంపై సంబంధిత అధికారులు ప్రకటన చేసే వరకు గుట్టపై భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ట్రాప్ కెమెరాల ఏర్పాటు..**

సిద్ధుల గుట్టపై చిరుత సంచారం నేపథ్యంలో ఎఫ్ఆర్వో శ్రీనివాస్, సిబ్బందితో కలిసి గుట్టను మంగళవారం పరిశీలించారు. చిరుత ఉన్నట్లు నిర్ధారించడానికి ట్రాప్ కెమెరాలను అమర్చనున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి, వారి సూచనల మేరకు చర్యలు చేపడుతామని పేర్కొన్నారు.

రూరల్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు



## ఎయిర్‌పోర్టు కోసం భూములివ్వలేం..

- మా భూములను తీసుకుంటే మేమేలా బతికేదీ?
- ప్రభుత్వ భూమిలోనే ఏర్పాటు చేయండి..
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డితో స్పష్టం చేసిన రైతులు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 29 : మండలంలో ఏర్పాటు చేస్తామన్న ఎయిర్‌పోర్ట్‌కు తమ పట్టా భూములు ఇవ్వలేమని రైతులు స్పష్టం చేశారు. మంగళవారం మండలంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే భూపతిరెడ్డిని ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదిత స్థలం చుట్టూ ఉన్న జక్రాన్‌పల్లి, మనోహరబాద్, కొలిప్యాక్, తొర్లికొండ, అర్గుల్ గ్రామాల రైతులు కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు అక్కడి ప్రభుత్వ భూమితోపాటు తమ భూములు కూడా తీసుకుంటున్నారని తెలిపారు. అక్కడున్న రైతులకు రెండు మూడెకరాలకు మించి భూమి లేదని, ఉన్న ఆ భూమిపై ఆధారపడ్డామని, అది కాస్త తీసుకుంటే తమ పరిస్థితి ఏంటని వాపోయారు. ప్రభుత్వ భూమిలోనే ఎయిర్‌పోర్ట్ నిర్మించాలని, తమ పట్టా భూములు మాత్రం ఇవ్వబోమంటూ ఎమ్మెల్యేతో స్పష్టం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ..ఇది తాను నిర్ణయం తీసుకోవాల్సిన విషయం కాదని, సీఎం దృష్టికి తీసుకెళ్తానని, కానీ కచ్చితమైన హామీ మాత్రం ఇవ్వలేనని, తన ప్రయత్నం తాను చేస్తానని రైతులతో పేర్కొన్నారు.

## ధాన్యం కొనుగోలులో జాప్యం

- రైతన్నల ఆగ్రహం
- లింగాపూర్-శాఖపూర్ రోడ్డుపై రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు

నవీపేట, ఏప్రిల్ 29: కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయడంలో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు రోడ్డెక్కారు. మండలంలోని శాఖపూర్ గ్రామానికి చెందిన రైతులు మంగళవారం లింగాపూర్-శాఖపూర్ రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధాన్యం తూకం వేసి రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ధాన్యాన్ని తరలించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తూకం చేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించి న్యాయం చేయాలని, ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే తమకు ఆత్మహత్యే శరణమని పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో తూకం చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడంలో అధికారులు విఫలమయ్యారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

## ఇసుక క్వారీ వద్ద కూలీల ఆందోళన

### ఉపాధి కల్పించాలని టిప్పర్ల అడ్డగింత

బోధన్ రూరల్, ఏప్రిల్ 29: బోధన్ మండలంలోని సిద్ధాపూర్ ఇసుక క్వారీ వద్ద సిద్ధపూర్, కల్దుర్కి గ్రామాలకు చెందిన కూలీలు మంగళవారం ఆందోళన చేపట్టారు. డోజర్ల ద్వారా టిప్పర్లలో ఇసుకను నింపడంతో తాము ఉపాధి కోల్పోతున్నామని టిప్పర్లను నిలిపి నిరసన వ్యక్తం చేశారు. టిప్పర్లలో ఇసుక నింపకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ.. సిద్ధాపూర్ క్వారీ నుంచి అధికారికంగా వారంలో మూడు రోజులు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించడాని అనుమతి ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు ట్రాక్టర్లు కాకుండా టిప్పర్లకు పర్మిషన్ ఇవ్వడంతో కూలీలకు పని లేకుండా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. విషయం తెలుసుకున్న బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి, క్వారీ నిర్వాహకులు, కూలీలతో మాట్లాడి సముదాయించారు. బుధవారం నుంచి కూలీలకు పనికల్పిస్తామని క్వారీ నిర్వాహకులు చెప్పారు.



సిద్ధాపూర్ గ్రామ శివారులో ఇసుక టిప్పర్లను అడ్డుకొని నిరసన తెలుపుతున్న కూలీలు

## పార్ట్ టైం లెక్చరర్ల వంటా-వార్పు

### తొమ్మిదో రోజుకు చేరిన సమ్మె

భిక్కనూరు, ఏప్రిల్ 29: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సౌత్ క్యాంపస్‌లో పార్ట్‌టైం లెక్చరర్లు చేపట్టిన సమ్మె తొమ్మిదో రోజుకు చేరుకున్నది. ఇందులో భాగంగా మంగళవారం వంటా-వార్పు కార్యక్రమం చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రత కల్పించాలని, మినిమం టైం స్కేల్ ఇవ్వాలని కోరారు. ఎన్నికల వేళ తమకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న పార్ట్‌టైం లెక్చరర్లకు క్యాంపస్‌లోని టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది సంఘీభావం ప్రకటించారు.



సౌత్ క్యాంపస్‌లో వంటా-వార్పు తో నిరసన వ్యక్తం చేస్తున్న పార్ట్ టైం లెక్చరర్లు

## ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యా యత్నం

బాన్సువాడ, ఏప్రిల్ 29: తనకు సెలవు పొడిగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని బాన్సువాడ ఆర్టీసీ డిపో డ్రైవర్ ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గడ్డిమందు తాగి ఆఫీస్‌కు వచ్చి స్పృహ కోల్పోవడంతో తోటి సిబ్బంది వెంటనే దవాఖానకు తరలించారు. గంగాధర్ అనే ఆర్టీసీ డ్రైవర్ ఆరోగ్యం బాగోలేకపోవడంతో సెలవులో ఉన్నాడు. ఈ నెల 29న విధులకు హాజరుకావాల్సి ఉండడంతో మంగళవారం డిపోనకు వచ్చాడు. తన ఆరోగ్యం ఇంకా కుదుటపడలేదని, సెలవు పొడిగించాలని డీఎం సరితాదేవి వద్దకు వెళ్లి చెప్పగా..ఆమె కార్యాలయంలో లెటర్ రాసి ఇచ్చివెళ్లాలని సూచించారు. అనంతరం గంగాధర్ డిపోలో ఏడుస్తూ కూర్చోగా అక్కడే ఉన్న సెక్యూరిటీ సిబ్బంది వచ్చి ఏమైందని అడుగగా తాను గడ్డిమందు తాగినట్లు చెప్పాడు. వెంటనే అంబులెన్సులో దవాఖానకు తరలించారు. ఈ విషయమై ఆర్టీసీ డీఎంను వివరణ కోరగా.. డ్రైవర్ ఆరోగ్యం బాగోలేదని ఆరు రోజులుగా విధులకు రాలేదని తెలిపారు. తాను పనిమీద కారులో బయటికి వెళ్తుండగా చేతిలో కాగితాలు పట్టుకొని వచ్చాడని, ఆరోగ్యం బాగోలేకపోతే కార్యాలయంలో సిబ్బందిని కలిసి లెటర్ ఇవ్వాలని సూచించినట్లు చెప్పారు. గతంలో ఆరోగ్యం బాగోలేదని చెప్పి నిజామాబాద్ దవాఖాన నుంచి సిక్ లెటర్ తెచ్చాడని, అతడు 29న డ్యూటీలో చేరాల్సి ఉన్నదని తెలిపారు. ఆయన ఆరోపణలు చేయడం సరికాదన్నారు.